క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

తిరువూరు: తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, ఆయా పోస్టులకు గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 12 ఖాళీలకు 70 మంది దరఖాస్తు చేయగా, అభ్యర్థులను ఆర్డీవో మాధవి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి, తిరువూరు ప్రాజెక్టు అధికారి సత్యవతి ఇంటర్వ్యూ చేశారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఏ.కొండూరు మండలాలకు చెందిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

చంద్రశేఖరస్వామికి మహాకుంభాభిషేకం

విస్సన్నపేట: కార్తిక మాసం శుద్ధ ఏకాదశి సందర్భంగా స్థానిక గంగాపార్వతి సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానంలో స్వామివారికి మహాకుంభాభిషేకాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రమాసహిత సత్యనారాయణ స్వామివారికి 40 మంది దంపతులు సామూహిక వ్రతాలు నిర్వహించారు. స్థానిక వైభవ్ జ్యూయలరీ మార్ట్ నిర్వాహకుడు కుక్కడపు వెంకట నాగేశ్వరరావు, రత్నకుమారి దంపతులు భక్తులకు రూపులు అందజేశారు. మహాకుంభాభిషేకానికి కట్టమూరి రామకృష్ణారావు, కమలస్వాతి దంపతులు, కుక్కడపు ప్రసాదరావు, అలివేలు మంగతాయారు దంపతుల ఆర్థిక సాయంతో నిర్వహించామని ఆలయ చైర్మన్ హనుమాన్ వెంకటరత్నం, ఈవో సీతారామయ్య తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రెడ్డిగూడెం: ఈనెల 26వ తేదీన భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువజన కేంద్రం, రెడ్డిగూడెం ఎన్జీవో ఫ్రెండ్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు భారత రాజ్యాంగ రచన – దాని ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో 117 మంది విద్యార్థులు హాజరైనట్లు ఫ్రెండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయ్‌కుమార్ తెలిపారు. విజేతలకు 26వ తేదీన జరిగే రాజ్యాంగ ఆమోద దినోత్సవంలో బహుమతులు అందజేస్తామన్నారు. గురుకుల పాఠశాల హెచ్‌ఎం తబిత, పత్తిపాటి పాల్ ఇమ్మానియేలు, చాట్ల హన్న, ఉపాధ్యాయులు చైతన్య పాల్గొన్నారు.

చాట్రాయికి చేరిన అయోధ్య రామాలయం అక్షింతలు



చాట్రాయి: అయోధ్య రామాలయానికి చెందిన అక్షింతలు మండలంలోని చాట్రాయి రామాలయానికి గురువారం చేరాయి. అయోధ్యలో శ్రీరామునికి సమర్పించే పవిత్ర అక్షింతలను గ్రామాల్లో ప్రతి ఇంటికీ పంపిణీ చేయనున్నట్లు సమరసతా సేవా సమితి ట్రస్ట్ నిర్వాహకుడు కేశవస్వామి తెలిపారు.

రేపు అర్బన్ పీహెచ్‌సీ ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పురపాలక సంఘం పరిధిలోని 27వ వార్డు శ్రామికనగర్‌లో రూ.80 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శనివారం ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఏపీ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ప్రారంభిస్తారన్నారు. వార్డు కౌన్సిలర్లు, అధికారులు, ప్రముఖులు పాల్గొనాలని ఆయన కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

గోసవీడు(గంపలగూడెం): మండలంలోని గోసవీడు విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం శ్రీమేధా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు అరిపిరాల అప్పయ్యశాస్త్రి, అర్చక బృందంచే ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు మహాఅన్నదానం చేశారు. పెద్దకొమిర వెంకటేశ్వర భక్త బృందంచే ప్రత్యేక భజన గావించారు. కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

విస్సన్నపేట: స్థానిక సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయిబాబా 98వ జయంతి సందర్భంగా సేవామందిరం వద్ద గురువారం పారిశుద్ధ్య సిబ్బందికి, పేదలకు దుప్పట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం మందిరంలో ప్రత్యేక భజనలు, పూజలు నిర్వహించి, స్వామివారి పల్లకి సేవ నిర్వహించారు. విస్సన్నపేట సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, విద్యార్థులకు పలు వ్యాసరచన పోటీలు నిర్వహించి జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, సత్యసాయి సేవాసమితి కన్వీనర్లు జె.రంగారెడ్డి, శ్రీలక్ష్మి, సేవాసమితి సభ్యులు అనుమోలు రాజారావు, పెనుగొండ రాంబాబు, నాగుబండి విశ్వనాథరావు, మద్దు మధుసూదనరావు, జీవీ చలపతిరావు, బాలు, పోలూరి సాంబయ్య, అనుమోలు లక్ష్మణరావు, నాగుబండి సునీత, అత్తునూరి జ్యోతి, బిందు, భక్తులు పాల్గొన్నారు. స్థానిక చిట్లూరి మంగలాద్రి రైస్ మిల్లు వద్ద సత్యసాయిబాబా భజన, అన్నసమారాధన నిర్వహించారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి

- తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి
- ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమాలు



మేడూరులో డిస్ ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

మేడూరు(గంపలగూడెం): నాలుగున్నరేళ్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందారని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని మేడూరులో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీ కార్యాలయం వద్ద పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన డిస్ ప్లే బోర్డును ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లంచగొండితనం, దళారులు లేకుండా ప్రజలకు మంచి జరిగే విధంగా ముఖ్యమంత్రి పాలనసాగిస్తున్నారన్నారు. సర్పంచ్‌లు గుండ్ల లక్ష్మి, వి.గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ కామసాని విజయనిర్మల, సొసైటీ అధ్యక్షుడు బరిగెల రామారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు జి.చెన్నకేశవరెడ్డి, నల్లగట్ల బాలు, కామసాని శంకర్‌రెడ్డి, వీరాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ ముత్యాల రామకృష్ణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు లింగమ్మ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో నంబర్‌వన్

తిరువూరు: పేదరిక నిర్మూలనకు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ఏపీ ప్రభుత్వం దేశంలోనే అగ్రగామిగా ఉందని ఎమ్మెల్యే రక్షణనిధి అన్నారు. మండలంలోని రోలుపడిలో గురువారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, సర్పంచ్ ముండ్లపాటి కాంతమ్మ, పీఏసీఎస్ చైర్మన్ బండి రవికుమార్, నాయకులు వెంకటరత్నం, ఈవోపీఆర్డీ వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

కొర్లమండలో..

కొర్లమండ(విస్సన్నపేట): మండలంలోని కొర్లమండ సచివాలయం పరిధిలో పల్లెకు పోదాం, ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాలను నిర్వహించారు. పథకాల లబ్ధి వివరాల డిస్ ప్లే బోర్డును జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, మండల అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్ దేవరం విజయకుమారి, ఎంపీటీసీ నెక్కళపు వసుంధర, సొసైటీ అధ్యక్షుడు దేవరం వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నెక్కళపు లక్ష్మణరావు, కృష్ణమూర్తి, మురళి పాల్గొన్నారు.

తిరువూరులో పల్లెకుపోదాం

తిరువూరు: స్థానిక 19, 20 వార్డుల్లో గురువారం సాయంత్రం పల్లెకు పోదాం కార్యక్రమం జరిగింది. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డులు ఆవిష్కరించారు. వైస్ చైర్‌పర్సన్లు వెంకటేశ్వరి, విజయలక్ష్మి, వార్డు కౌన్సిలర్లు నదియా, సత్యనారాయణ, దుర్గారావు, శ్రీనివాసరావు, రాష్ట్ర యాదవ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ కె.విజయలక్ష్మి, నాయకులు నాగేశ్వరరావు, అజీజ్ పాల్గొన్నారు.

రేపూడి గ్రామంలో..

ఏ.కొండూరు: మండలంలోని రేపూడి గ్రామ సచివాలయంలో గురువారం పల్లెకు పోదాం, ఆంధ్రప్రదేశ్ జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును జెడ్పీటీసీ సభ్యులు భూక్య గనియా ఆవిష్కరించారు. సర్పంచ్ వజ్రాల సత్యవేణి, ఎంపీటీసీ బత్తుల ఆదిలక్ష్మి, నాయకులు వజ్రాల బ్రహ్మానందరెడ్డి, బత్తుల వెంకయ్య, దాసరి సతీష్, వెంకట్ పాల్గొన్నారు.

కాచవరంలో..

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరంలో సర్పంచ్ డి.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకుపోదాం కార్యక్రమం గురువారం జరిగింది. డీబీటీ, నాన్ డీబీటీలో రూ.24.49 కోట్లుతో జరిగిన సంక్షేమ అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావుతో కలిసి సర్పంచ్ ఆవిష్కరించారు. ఎంపీటీసీ ముద్దంగుల రంగస్వామి, మండల సచివాలయాల కోఆర్డినేటర్ కోసూరు వెంకటేష్, ఈవోపీఆర్డీ మనోజ్, కార్యదర్శి అనీల్, పాల్గొన్నారు. కొండపల్లి ఒకటో సచివాలయంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మిక్కిలి శరభయ్య, మున్సిపాలిటీ సచివాలయాల కోఆర్డినేటర్ లంకే అంకమోహనరావు డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో..

జి.కొండూరు: మండల పరిధి వెంకటాపురం గ్రామ సచివాలయ పరిధిలో పల్లెక పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను నిర్వహించారు. డిస్‌ప్లే బోర్డును ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, నాయకులు ఆవిష్కరించారు. సచివాలయాల మండల కన్వీనర్ కాజా బ్రహ్మయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నెల్లూరి లీలా శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు యరమల విజయశ్రీ, నాయకుడు గోపిరెడ్డి పాల్గొన్నారు.



వెంకటాపురం గ్రామ సచివాలయంలో డిస్ ప్లే బోర్డును ప్రారంభించిన నాయకులు

పుల్లూరులో..

పుల్లూరు(మైలవరం): మండలంలోని పుల్లూరు-2 గ్రామ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం జరిగింది. పథకాల డిస్ ప్లే బోర్డును పీఏసీఎస్ అధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణారెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు.

గ్రామాల అభివృద్ధే జగనన్న లక్ష్యం

ముసునూరు: గ్రామాల సమగ్ర అభివృద్ధే జగనన్న ప్రధాన లక్ష్యమని వైస్ ఎంపీపీ రాజానాయన అన్నారు. ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో గురువారం గోపవరం-1 గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ కె.వాణి అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును వైస్ ఎంపీపీ-2 పి.గంగాధర్ ప్రారంభించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, ఎంపీటీసీలు వెంకమ్మ, ఖాలీషా మస్తాన్ వలి, సొసైటీ అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ, ఉప సర్పంచ్ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి, సుకుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

చాట్రాయి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని మర్లపాలెం గ్రామ సచివాలయంలో నిర్వహించిన పల్లెకు పోదాం, ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాలను నిర్వహించారు. సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, ఈవోపీఆర్డీ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, నాయకులు కుప్పాల మద్దిరామయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దేశిరెడ్డి తదితరులు

నూజివీడులో..

నూజివీడు: పట్టణంలోని 7వ వార్డు సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా వార్డు సచివాలయం వద్ద 13, 14 వార్డులకు నాలుగున్నరేళ్లలో చేకూరిన లబ్ధిని తెలిపే బోర్డును కౌన్సిలర్లు ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, సచివాలయాల కన్వీనర్ పిళ్లా చరణ్, కౌన్సిలర్ కొడవటి రాంబాబు, తలారి సతీష్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు పాల్గొన్నారు.

కృష్ణవరంలో..

ఆగిరిపల్లి: మండలంలోని కృష్ణవరం గ్రామంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమాలను నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. సర్పంచ్‌లు కమ్మిలి జ్యోతి, కేఎస్ఎస్ దిలీప్, నందూరు భాస్కర్ ప్రసాద్, ఈవోపీఆర్డీ శేఖర్, నాయకులు కమ్మిలి రాంబాబు, చెన్ను శ్రీనివాసు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మైలవరం రాజకీయాలను నందిగామ నేతలు భ్రష్టు పట్టిస్తున్నారు

మైలవరం: ప్రశాంతంగా ఉండే మైలవరం నియోజకవర్గంలో రాజకీయాలను నందిగామ నేతలు భ్రష్టు పట్టిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని సహజ వనరులు దోచుకుంటూ చిల్లర పంచాయతీలు చేసుకుంటూ అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మైలవరం నియోజకవర్గం మారిందని రమేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. మైలవరం నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి, సహజ వనరుల దోపిడీలో వాటాలు కుదరకే చిల్లర పంచాయతీలు చేస్తూ, వ్యక్తిగత విమర్శలతో నందిగామ నేతలు కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. స్థానికేతరులు కావడంతో నియోజకవర్గ అభివృద్ధిపై బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తూ మహిళలు సైతం తలదించుకునే విధంగా వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని తెలిపారు. వ్యక్తిగత దూషణలు, కుటుంబ కలహాలు నియోజకవర్గ ప్రజలకు అవసరం లేదన్నారు. అవినీతి, అక్రమాలు చాలించాలని, లేకుంటే నియోజకవర్గ ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

నూజివీడు: పట్టణంతో పాటు మండలంలో ఈ నెల 27 నుంచి నిర్వహించనున్న కులగణన సర్వేను వలంటీర్లు పకడ్బందీగా నిర్వహించాలని, సచివాలయ సెక్రటరీలో కులగణనను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని స్త్రీశక్తి భవన్‌లో గురువారం వార్డు, గ్రామ సచివాలయాల సెక్రటరీలకు కులగణనపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సర్వేకు ప్రభుత్వం యాప్‌ను సిద్ధం చేసిందని, యాప్‌లో పేర్కొన్న అంశాలన్నింటినీ నమోదు చేయాలన్నారు. ఎంపీడీవో వీపీ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్‌రషీద్ పాల్గొన్నారు.

పారదర్శకంగా కులగణన చేయాలి

చాట్రాయి: , పారదర్శకంగా కులగణన చేయాలని ఎంపీడీవో దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై గురువారం అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు తమకు కేటాయించిన గృహానికి వెళ్లి వివరాలు నమోదు చేయాలన్నారు. ఎంపీపీ లంకా నిర్మల, ఈవోపీఆర్డీ మురళీకృష్ణ, ఎంఈవో బ్రహ్మచారి, ఏఎన్ఎంలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన సర్వేను పక్కాగా నిర్వహించండి

ఆగిరిపల్లి: కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ప్రత్యేకాధికారి వెంకటరత్నం ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27 నుంచి ప్రారంభమయ్యే సర్వేను వారం రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఎంపీడీవో శంకర్రావు, ఈవోపీఆర్డీ శేఖర్, ఎంఈవో – 2 కొవ్వాలి ఆనంద్‌కుమార్, ఏఎస్ఓ, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సర్వే విజయవంతం చేయాలి

ముసునూరు: కుల గణన సర్వేను విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ రాజానాయన సూచించారు. ఈనెల 27 నుంచి డిసెంబర్ 3 వరకు జరుగనున్న కులగణన సర్వే ఏర్పాట్లపై ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన అధికారులు, సచివాలయ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఏఎస్ఓ హైమ మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి, ముందుగానే ప్రజలకు కుల గణన సర్వే కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. మాజీ ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తహసీల్దార్ దాసరి సుధ, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు తప్పనిసరి

మైలవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పనిసరిగా కనీస మౌలిక సౌకర్యాలు ఉండాలని ఐసీడీఎస్ జిల్లా ఏపీసీ మహేశ్వరరావు ఆదేశించారు. మైలవరం సీడీపీవో కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్స్, కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. సమావేశంలో మహేశ్వరరావు మాట్లాడుతూ నాడు–నేడు ఫేజ్ -2బీలో సొంత భవనాలు, ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు మరమ్మతుల నిమిత్తం మైలవరం ప్రాజెక్టు పరిధిలో 105 కేంద్రాలు ఎంపిక చేశామన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో టాయిలెట్స్, తాగునీటి వసతి, ఎలక్ట్రిఫికేషన్, పెయింటింగ్ ఉండాలన్నారు. త్వరలో మరమ్మతు పనులు ప్రారంభించబడతాయని, దీనిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందన్నారు. చిన్నారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని చెప్పారు. సదా, సురేంద్ర, ఎంఈవో ఎల్.బాలు, ఐసీడీఎస్ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర విజయవంతం చేయాలి

తిరువూరు/జి.కొండూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి చేపట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్రను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి జయచంద్ర గాంధీ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తిరువూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ శాఖల అధికారులతో, జి.కొండూరులోని కమ్యూనిటీ హాల్‌లో జి.కొండూరు, మైలవరం మండలాల అధికారులకు గురువారం వేర్వేరుగా అవగాహన సమావేశాలు నిర్వహించారు. గ్రామ స్థాయిలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను వివరించి వారి స్పందన నమోదు చేయాలని డీపీవో కోరారు. ప్రధాని మోదీ ప్రసంగాలను ప్రసారం చేసే పెద్ద స్క్రీన్‌లను గ్రామాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి మోతీబాబు, తిరువూరు, ఏ.కొండూరు, విస్సన్నపేట, జి.కొండూరు ఎంపీడీవోలు నాగేశ్వరరావు, రవికాంత్, వెంకటరమణ, అనూరాధ మాట్లాడారు. అన్ని మండలాల విద్య, వైద్యారోగ్య, వెలుగు, ఉపాధిహామీ, పశువైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు ఆటల పోటీలు

విస్సన్నపేట: జిల్లా స్థాయి గిరిజన విద్యార్థులకు ఆటల పోటీలను స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. జనజాతీయ దివస్, బిర్సాముండా జయంతి వారోత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి గిరిజన విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన గురుకుల విద్యాలయాల కన్వీనర్ జి.జాన్సన్ దేవరాజ్ తెలిపారు. రిబ్బన్ కట్ చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. వ్యాస రచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలతో పాటు కబడ్డీ, వాలీబాల్, జావెలిన్‌త్రో ఆటలు పోటీలు బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. జిల్లాలో అన్ని గిరిజన గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీగిరి వీరేశ్వర విశ్వేశ్వర స్వామి (శివాలయం) ఆలయంలో భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ఆలయ అర్చక బృందం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ ట్రస్టీ ఎం.రామలింగేశ్వరరావు దంపతులు, వీరబ్రహేంద్రస్వామి ఆలయ ట్రస్టీ కత్తురోజు రామకృష్ణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 26న ఆలయం వద్ద నిర్వహిస్తున్న జ్వాలా తోరణంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ట్రస్టీ రామలింగేశ్వరరావు తెలిపారు.

ఊటుకూరులో..

ఊటుకూరు(గంపలగూడెం): మండల పరిధిలోని ఊటుకూరు రామాలయంలో కార్తిక ఏకాదశి పర్వదినోత్సవం సందర్భంగా గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. 50 మంది దంపతులు వ్రతాన్ని ఆచరించారు. వ్రతం విశిష్టతను అర్చకులు వివరించారు.

మేలైన విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

చిలుకూరు(ఇబ్రహీంపట్నం): రైతులు వ్యవసాయంలో మేలైన విత్తనశుద్ధి చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని విజయవాడ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారి ప్రేమరంజితం అన్నారు. మండలంలోని చిలుకూరులో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏవో వాసుదేవరావు, ఏఏవో మనీషా, సీఐపీఎంసీ బృందం పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక వైద్యశిబిరం

తిరువూరు: స్థానిక ఆస్టర్ రమేష్ అమరావతి ఆస్పత్రిలో ఈ నెల 25న ఆర్థోపెడిక్ రోగులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ కోనేరు వెంకటకృష్ణన్ తెలిపారు. తిరుపతి బర్డ్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ జగదీష్ వైద్యపరీక్షలు చేస్తారన్నారు. 79970 36777 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆగిరిపల్లిలో వైభవంగా ధ్వజారోహణం

ఆగిరిపల్లి: శ్రీ శోభనాచల వ్యాఘ్రలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని గురువారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ధృవ మూర్తికి పంచామృత స్నాపన, విశేష అలంకరణ నిర్వహించారు. అనంతరం హోమాలు, పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు కలవపల్లి రామచంద్ర శర్మ దంపతులు, వింత శ్రీనివాస్ రెడ్డి దంపతులు, కాసరనేని ఫణీంద్ర దంపతులు, స్వామివారికి నవ కుంభారోవణ, సర్వ దైవత్య హోమాలను ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు పర్యవేక్షణలో నిర్వహించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చాట్రాయి: చనుబండ రైతు భరోసా కేంద్రంలో గురువారం పీఏసీఎస్ చైర్మన్ మోరంపూడి నాగేశ్వరరావు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, ఉప సర్పంచ్ దిరిశాల చినబాబు, ఎంపీటీసీ దార్ల సోనీ ఆనంద్, చింతగుంట్ల వెంకటేశ్వరరావు, నాయకులు జల్లేపల్లి పరమేశ్వరావు, వనమామ వాసు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక

ముసునూరు: రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ముసునూరు హైస్కూల్ హెచ్‌ఎం సునీల తెలిపారు. ఇటీవల విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగిన ఎంపికల్లో తమ పాఠశాల విద్యార్థులు అండర్-14 విభాగంలో పి.ఐశ్వర్య, అండర్-17 విభాగంలో ఎం.సంతోష్‌కుమార్ ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయి త్రోబాల్ జట్టుకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను, పీఈటీలు హేమాదేవి, ఆలీఖాన్‌లను గురువారం ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు వాణికుమారి, ఫ్రాన్సిస్, యువరాజు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు అభినందించారు.

దిగవల్లి హైస్కూల్ విద్యార్థి ఎంపిక

నూజివీడు: మండలంలోని దిగవల్లి హైస్కూల్ విద్యార్థి స్టాలిన్(10వ తరగతి) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శోభారాణి తెలిపారు. విజయవాడలో జరిగిన సెలక్షన్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు పేర్కొన్నారు. స్టాలిన్‌ను హెచ్‌ఎం శోభారాణి, సర్పంచ్ కెత్తే నాని, ఉపాధ్యాయులు, సీఆర్పీ కేశవరావు, పీడీ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

మట్టి ట్రాక్టర్ల పట్టివేత

విస్సన్నపేట: అనుమతులు లేకుండా మట్టి తోలకాలు నిర్వహిస్తున్న మూడు మట్టి ట్రాక్టర్లను స్థానిక ట్రాక్టర్ ఓనర్లు, డ్రైవర్లు నిలుపుదల చేసి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు అనుమతులు లేకుండా పక్క మండలం నుంచి విస్సన్నపేటకు మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

మహా ధర్నా కరపత్రాల ఆవిష్కరణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో జరిగే మహాధర్నా విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ కోరారు. ఈమేరకు కొండపల్లి ఐడీఏలో హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి కరపత్రాలు గురువారం ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతులు, కార్మికులు, వ్యాపార రంగం, అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు రోజులు చేపట్టనున్న ధర్నాలో అసంఘటిత రంగ కార్మికులు పాల్గొని నిరసన తెలిపాలని కోరారు. కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారాలు వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్



వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత, నాయకులు

రెడ్డిగూడెం: విజ్ఞాన భాండాగారాలు డాక్టర్ వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలని విద్యార్థులు, ఉద్యోగుల సౌకర్యార్థం ప్రతి గ్రామ పంచాయతీలో డాక్టర్ వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని అన్నేరావుపేట గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. అనంతరం రూ.1.02 కోట్లతో నిర్మించిన తండాకు చేరుకునే సిమెంట్ రహదారిని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీతారామపురం తండాకు చేరుకునే సిమెంట్ రహదారికి తన హయంలోనే శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశానని చెప్పారు. కార్యక్రమంలో మైలవరం మార్కెట్ యార్డు చైర్మన్ సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, మాజీ ఎంపీపీ మైలమాల కాంతారావు, మండల పార్టీ కన్వీనర్ బొలగాని తిరుపతిరావు, అన్నేరావుపేట ఎంపీటీసీ మాధవిలత, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ బత్తుల వెంకటేశ్వరరెడ్డి, రెడ్డిగూడెం సొసైటీ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి తక్షణ సాయం అందించండి

ముసునూరు: అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత కుటుంబానికి తక్షణ సాయం అందించాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని చెక్కపల్లిలో గురువారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన వితంతువు కటారి చిట్టికాసులు తన కుటుంబానికి సాయం, రేషన్ కార్డు, వితంతు పింఛన్ మంజూరు చేయించాలని కోరింది. మరో తొమ్మిది మంది తమ భూమి ఆన్‌లైన్‌లో చెరువు అని నమోదైందని, సమస్యను పరిష్కరించాలని ఎంపీని కోరారు. స్పందించిన ఆయన కాలిపోయిన ఇంటిని స్థానిక నేతలతో కలిసి సందర్శించారు. తక్షణమే మండల తహసీల్దార్ దాసరి సుధకు ఫోన్ చేసి, అగ్ని బాధిత కుటుంబానికి సాయం చేసి, వితంతువుకు రేషన్ కార్డు, వితంతు పింఛన్ మంజూరు చేయాలని ఆదేశించారు. బాధితుల భూమి సమస్యను పరిష్కరించాలని నూజివీడు సబ్ కలెక్టర్‌కు ఫోన్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజానాయన, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు సీహెచ్ దేవేంద్ర, కాటేపల్లి రమేష్, దత్తుడు తదితరులు పాల్గొన్నారు.



చెక్కపల్లిలో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీధర్

రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసిన జేసీ

విజయవాడరూరల్: ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ గురువారం జక్కంపూడి గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు రైతు భరోసా కేంద్రం లో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యంగా గోనె సంచులు, తేమ కొలుచు సాధనం, కంప్యూటర్ ప్రింటర్, ఇంటర్నెట్ సౌకర్యం, ధాన్యం కొనుగోలులో ఉపయోగించు పరికరాల లభ్యతలను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రంలో అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆర్బీకే సిబ్బంది సహకరించాలని ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యం కొనగోలు చేయటంలో దళారులకు, మధ్య వర్తులకు, మిల్లర్లకు ఎటువంటి స్థానం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి సమస్య ఎదురైనా జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ కార్యాలయంలోని కంట్రోల్ రూం నెంబర్ 77020 03571కు ఫోను చేసి వెంటనే సమస్యకు పరిష్కారం పొందాలని ఆదేశించారు. జేసీ వెంట రూరల్ మండల తహసీల్దార్ కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జక్కంపూడి ఆర్బీకేలో సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ సంపత్‌కుమార్